క్లుప్తంగా

వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి


మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని ప్రధాన సమస్యలపై కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ గురువారం మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డులోని రోడ్లు, డ్రెయిన్లు, శ్మశానవాటిక వంటి పలు సమస్యలను ఆమెకు వివరించారు. వార్డుపై దృష్టి సారించాలని కార్పొరేటర్ కోరారు.

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాను మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ప్రధాన అర్చకుడు రాజా స్వామి పూజలు చేసి ప్రసాదం అందజేశారు. ఆలయ సిబ్బంది శివ, భక్తులు పాల్గొన్నారు.

అభాగ్యులకు ఆహారం


ఆహారం పొట్లాలు అందిస్తున్న ట్రస్టు సభ్యులు

కంచరపాలెం: శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ మాజీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుప్పిలి త్రినాథరావు పట్నాయక్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం అభాగ్యులకు ఆహారం పొట్లాలు అందజేశారు. ముఖ్య అతిథులు రైల్వే కానిస్టేబుల్ బి.బంగారప్పడు, ఎన్ఎస్‌టీఎల్ రిటైర్డ్ గెజిటెడ్ అధికారి టి.వి.చారి వాటిని పంపిణీ చేశారు. కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం, రైల్వే స్టేషన్, దొండపర్తి ప్రాంతాల్లో సుమారు 500 మందికి ఆహారం పొట్లాలు అందించినట్లు ట్రస్టు అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి పట్నాయిక్ తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విశేష పుష్పయాగం

- ప్రత్యేక అలంకరణలో లలితాదేవి దర్శనం


లలితా అమ్మవారికి పుష్పయాగం చేస్తున్న వేద పండితులు, అర్చకులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం 74వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం సాయంత్రం పీఠం దర్బారు హాల్లో లలితా అమ్మవారికి విశేష పుష్పయాగం చేశారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ వేదమంత్రాల నడుమ వివిధ రకాల పూలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని చూడముచ్చటగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని యాగాన్ని తిలకించారు.

లలితాకామేశ్వరుల కల్యాణం నేడు..

లలితా పీఠం దర్బారు హాల్లో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు లలితాకామేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు మహాప్రసాద వితరణ నిర్వహిస్తామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ పథకాలు


టీపీటీ కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్ సచివాలయం(1086123) పరిధిలో రెండో రోజు గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి నెడ్ క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త ఇంటింటా పర్యటించారు. ఆయనకు లబ్ధిదారులు హారతులతో స్వాగతం పలికారు. ప్రతి గడపకూ వెళ్లి మూడేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు.

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ వెళ్తుంటే ప్రజలు ఆప్యాయంగా పలకరించడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాయుడు శ్రీను, నూకరాజు జి.అశోక్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సీతాకుమారి, ఎస్.రాజారెడ్డి, జమున, ఆశ, ఆదినారాయణ, నేపాల్ శ్రీను, కె.గోవింద్ తదితరులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయం అద్భుతం


విద్యార్థులతో మాట్లాడుతున్న మేఘనా ఇంటర్నేషనల్ సీఈవో సీతారామస్వామి

సీతంపేట: పౌర గ్రంథాలయం అత్యాధునిక సౌకర్యాలతో అద్భుతంగా ఉందని మేఘనా ఇంటర్నేషనల్ కంపెనీ సీఈవో కె.సీతారామస్వామి అన్నారు. ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీని గురువారం ఆయన సందర్శించారు. అక్కడి అన్ని విభాగాలను చూశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఏయే పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రయోజనకరంగా గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారని అభినందించారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ లైబ్రరీలో ఉన్న సదుపాయాలను ఆయనకు వివరించారు.

సచివాలయ పనుల పరిశీలన


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నర్సింహనగర్ దరి సచివాలయ భవనం శ్లాబ్ పనులను బుధవారం కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజు పరిశీలించారు. ఏఈ శ్రీరామ్మూర్తిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేగంగా పనులు జరిపించాలని సూచించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రూ.20 లక్షలతో సచివాలయ భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే వార్డులో రోడ్లు వేశామని, రూ.2.5 కోట్లతో స్వీపర్ పార్కు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం మెడికవర్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం, ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు, భక్తులకు బీపీ, మధుమేహం, బరువు, ఎత్తు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి సంబంధిత న్యూట్రిషనిస్ట్, వైద్యుల ద్వారా సలహాలు, సూచనలిచ్చారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా ప్రతి ఒక్కరూ ఐరన్, ప్రోటీన్, కాల్షియం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సిబ్బంది, మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఉదయం సాయిబాబాకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం హారతి అనంతరం పేదలకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పేరాల సాహితీ పురస్కారం ప్రదానం


పేరాల భరతశర్మ పురస్కారంతో భైరవభట్ల కామేశ్వరరావు దంపతులు

సీతంపేట: శ్రీవిశ్వనాథ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అవధాని పేరాల భరతశర్మ 90వ జయంత్యుత్సవ సభ నిర్వహించారు. పేరి రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత భైరవభట్ల కామేశ్వరరావుకు పేరాల సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. భైరవభట్ల రచించిన 'పాషాణ పాక ప్రభూ' వ్యాస సంపుటి అనే పుస్తకాన్ని గాయత్రి విద్యా సంస్థల కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు ఆవిష్కరించారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో కందాళ సత్యశ్యామ్, పేరాల సీతారామ ప్రభు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రోల్‌బాల్ దినోత్సవం


కేక్ కట్‌చేస్తున్న రోల్‌బాల్ క్రీడా చిన్నారులు, కోచ్ సంతోష్

మురళీనగర్: ప్రపంచ రోల్‌బాల్ డే వేడుకలను గురువారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఘనంగా నిర్వహించారు. కోచ్ పి.సంతోష్ ఆధ్వర్యంలో క్రీడాకారులు కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు తమ విశేష ప్రతిభను ప్రదర్శించి సందర్శకులను అలరించారు. రోల్‌బాల్ క్రీడను ప్రోత్సహించినట్లయితే విద్యార్థులు ఉన్నత స్థానంలోకి వెళ్లగలరని కోచ్ సంతోష్ అన్నారు.

వాకర్స్ క్లబ్ వార్షికోత్సవం రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ 28వ వార్షికోత్సవం ఈ నెల 4వ తేదీ సాయంత్రం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

25వ వార్డులో పింఛన్ల పంపిణీ


పింఛన్ సొమ్ము అందజేస్తున్న కార్పొరేటర్ సారిపల్లి గోవింద్


ఆస్పత్రిలో లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ కస్తూరి

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్ చేపల మార్కెట్ వద్ద స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల సమక్షంలో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలకు ఆయన పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్లు, సంక్షేమ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు 285 సచివాలయం పరిధి పింఛన్‌దారుడు నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పింఛన్ తీసుకోవడానికి ఇంటికి రాని పరిస్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ కస్తూరి గురువారం లబ్ధిదారుడు ఉన్న ఆస్పత్రికి వెళ్లి పింఛన్ నగదును అందించింది. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సేవా కార్యక్రమాలతో వాసుపల్లి జన్మదిన వేడుకలు


రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ లీలావతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి ఆధ్వర్యంలో గురువారం రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వాసుపల్లి చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు భీశెట్టి ప్రసాద్ నాయకత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాతలకు వారు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ 11 కేవీ వుడా చిల్డ్రన్ పార్కు ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు ఏఎస్సార్ నగర్, వోల్వో ఆఫీస్, నార్త్ ఎక్స్‌టెన్షన్, వుడా చిల్డ్రన్ పార్కు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో..

సీతంపేట: అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఎన్జీజీవోస్ కాలనీ, ఐసీడబ్ల్యూఏ భవన్, జీవీఎంసీ పంప్ హౌస్, జీవీఎంసీ స్కూల్స్, ఆరోగ్య కేంద్రం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మురళీనగర్, మద్దిపాలెం సెక్షన్లలో..

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ సూర్యానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సూర్యానగర్, సత్యానగర్, సాయిరామ్‌నగర్, సత్యానగర్-2, డీ-మార్ట్ ఏరియా, క్రోమా, పాస్‌పోర్టు కార్యాలయం, కోకో కోలా వెనక నివాస ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

- మద్దిపాలెం సెక్షన్‌లోని మద్దిపాలెం, కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బీకే నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు మద్దిపాలెం మహారాణి వీధి, మద్దిపాలెం మెయిన్ రోడ్డు, రాణాప్రతాప్ నగర్, గ్రీన్ గార్డెన్స్, కప్పరాడ రాంజీ ఎస్టేట్స్, సురేష్ రామనగర్, అరుంధతినగర్, కప్పరాడ, పెదకొత్తూరు, ఇందిరానగర్ 1-5, సంజీవయ్య కాలనీ, జయప్రకాష్‌నగర్-1, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం


మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. రామాటాకీస్ సమీపంలోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపారని, 2014 నుంచి బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో ఏపీని విస్మరిస్తున్నారని విమర్శించారు. విభజన హామీలపై బడ్జెట్‌లో ప్రస్తావన లేదని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశం, రాయలసీమ, ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించినప్పటికీ నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు, రాజ్యసభ సభ్యులు రాష్ట్రాభివృద్ధికి కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో గంగు మన్మధరావు, పెదిరెడ్ల సత్యం, ఇత్తంశెట్టి అమ్మాజీ, రామునాయుడు, బొత్స స్వామినాయుడు, పెదిరెడ్ల శ్రీనివాసరావు, నూకిరెడ్డి శివ, రాజేష్, గొల్లు శ్రీను పాల్గొన్నారు.

పార్కింగ్ పనులు వేగవంతం


పార్కింగ్ కోసం శుభ్రం చేయించిన స్థలం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల ప్రభుత్వ స్థలంలోని బడ్డీకొట్లను తొలగించి వాహనాల పార్కింగ్‌కు సిద్ధం చేశారు. చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ ఆదేశాల మేరకు అధికారులు ఈ పనులను వేగవంతంగా చేస్తున్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి బుద్దా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు వారి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఏఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమిషన్ ఆశ చూపిస్తూ కమిషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమిషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమిషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శైలజ


భర్త విజయకుమార్‌తో శైలజ(ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్‌ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎస్ఎస్‌యూఆర్‌ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయకుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు


పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్-విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్-కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ - కోయంబత్తూర్(03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం


పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ పర్ డెసీలీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.' అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

మహిళకు బ్యాగ్ అప్పగింత


బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న క్రైం డీసీపీ నాగన్న

అల్లిపురం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికి పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ.. పోతినమల్లయ్యపాలేనికి చెందిన ఎం.కస్తూరిబాయి బుధవారం తమ ఇంటికి వెళ్లేందుకు జడ్జి కోర్టు వద్ద ఆటో ఎక్కారు. ఆమె వద్ద డ్రై వాష్ చీరలతో బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్ ఉంది. గొల్లలపాలెం సర్కిల్ వద్ద డ్రై వాష్ చీరల బ్యాగ్ తీసుకుని దిగిపోయారు. హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయారు. అందులో రూ.లక్ష నగదు ఉంది. కొంతసేపటి వరకు ఆమెకు తన బ్యాగ్ గుర్తుకురాలేదు. తర్వాత తేరుకుని ఆటోలో మరిచిపోయానని గ్రహించారు. ఆటోను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ క్రైం జి.నాగన్న ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐలు కె.శ్రీను, డీవీ అప్పారావు తమ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి ఆటోను పట్టుకున్నారు. డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం బాధితురాలికి నగదుతో సహా బ్యాగ్‌ను అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.